https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 331 మంగళవారం 17-2-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

### మున్సిపల్ ఎన్నికల్లో చారిత్రాత్మక

## విజయం: భట్టి విక్రమార్క

**90-95 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా**

**పట్టణాల అభివృద్ధికి కట్టుబాటు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చారిత్రాత్మక విజయాన్ని అందించిన పట్టణ ఓటర్లందరికీ ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సుమారు 90 నుంచి 95 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల తీర్పు తమ ప్రభుత్వ పాలనపై ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. బాధ్యతాయుతమైన, పారదర్శక పాలనతో పట్టణాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల బలోపేతం, ప్రజా సేవల మెరుగుదల, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పారు. ఈ విజయం ప్రజల విజయం అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజల మద్దతు తమకు మరింత బాధ్యతను తీసుకొచ్చిందని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు.

### భారత్ వేగవంతమైన అభివృద్ధికి

# ఏఐ సమ్మిట్ నిదర్శనం

## ప్రధాని మోదీ

దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ను నిర్వహిస్తుండటంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ దేశాలకు భారత యువత ప్రతిభ, సామర్థ్యం తెలుస్తాయని అన్నారు. ప్రపంచ అభివృద్ధిలో భారత్ తన సహకారాన్ని మరింత పెంచుకునేందుకు ముందడుగు వేస్తోందని చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనమని ప్రధాని అన్నారు. గ్లోబల్ సౌత్‌లో నిర్వహిస్తున్న ఈ మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమ్మిట్ మన దేశంలో జరుగుతుండటం గర్వకారణమని చెప్పారు. 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ (అందరికీ సంక్షేమం, అందరికీ ఆనందం)' అనే ఈ సదస్సు థీమ్‌పై మోదీ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల పురోగతి కోసం కృత్రిమ మేథస్సును ఉపయోగించుకోవడంలో మన ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ ఏఐ సమ్మిట్‌వల్ల డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తిమంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందని ప్రధాని చెప్పారు. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పాలన లాంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తున్నదని అన్నారు. ఇవాళ్టి నుంచి 20వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న ఈ సదస్సుకు 45కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఆయా దేశాలు తమ ఏఐ



అజెండాలను నిర్వచించు కోను న్నాయని చెప్పారు. మన ప్రతిభను ప్రదర్శించడం, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, విస్తృతమవుతున్న అంకుర సంస్థల పర్యావరణ వ్యవస్థను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ సదస్సు ఉద్దేశమని ప్రధాని మోదీ వెల్లడించారు.

### వరి రైతులకు బోనస్

## బకాయిల విడుదల

**- రూ.514.36 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం**

**- 2.17 లక్షల మంది రైతులకు లాభం**



హైదరాబాద్, ఫిబ్రవరి 16 వరి రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. పెండింగ్‌లో ఉన్న వరి బోనస్ బకాయిలుగా రూ.514.36 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో సుమారు 2.17 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. వరి సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ముందుగానే ప్రకటించింది. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన రైతులకు ఈ బోనస్ వర్తించనుంది. కనీస మద్దతు ధరకు అదనంగా ఈ రూ.500 చెల్లింపులు జరుగుతున్నాయి. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం, రైతులను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. బకాయిల విడుదలతో రైతులకు ఆర్థిక ఉపశమనం లభిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# కాంగ్రెస్, బీజేపీలది అపవిత్ర కలయిక..

**ఈ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్ : హరీష్ రావు**

తెలంగాణలో అధికారం కోసం జెండాలు అజెండాలను పక్కనపెట్టి అధికార పీఠం కోసం ఎంతలా దిగజార్చవచ్చో కాంగ్రెస్, బీజేపీలు నేడు నిరూపించాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు అన్నారు. మార్పు అంటే బీజేపీతో జతకట్టడమేనా..? ఇదేనా మీరు తెస్తానన్న మార్పు అని ప్రశ్నించారు. గత 12 ఏండ్లుగా బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి బీ-టీమ్ అని కాంగ్రెస్, కాంగ్రెస్‌కు బీ టీమ్ అని బీజేపీ చెప్పినవన్నీ పచ్చి అబద్దాలు అని, ఆ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్ అని నిరూపించాయని పేర్కొన్నారు. బీజేపీతో కలిసి సింగిల్ టీమ్ గా మారిపోయింది. ఈ అపవిత్ర కలయిక, ఈ అనైతిక పొత్తు ప్రజలు గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీల మధ్య ఉన్న ఫెవికాల్ బంధం ఈరోజు మున్సిపల్ ఫలితాలతో మరోసారి స్పష్టమైంది. కేవలం బీఆర్ఎస్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ రెండు పార్టీలు సిద్ధాంతాలను గాలికొదిలేశాయి. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు ఒకటేనని ఈ మున్సిపల్ ఫలితాలు మరోసారి రుజువు చేశాయి. ఢిల్లీలో కొట్టుకున్నట్టు.. గల్లీలో మాత్రం చేతులు కలుపుతూ వాటాలు వేసుకొని పదవులు పంచుకుంటున్నారు. దీనికి అలియాబాద్, అమన్ గల్,మెదక్, నర్సాపూర్ ఫలితాలే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. రేవంత్ రెడ్డి .. మీరు నడిపేది కాంగ్రెస్ సర్కారా..? బీజేపీ సర్కారా.. ? బీజేపీ, టీడీపీతో కూడిన సంకీర్ణ సర్కారా..? అలియాబాద్ నుంచి అమన్‌గల్ దాకా.. మెట్‌పల్లి నుంచి మెదక్ దాకా మీరు సాగిస్తున్న ఈ చీకటి ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారని హరీష్ రావు అన్నారు..కాంగ్రెస్ పార్టీకి ఒంటరిగా బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే సత్తా లేదు. అందుకే సిగ్గు వదిలేసి బీజేపీతో కుమ్మక్కైంది. రెండు జాతీయ పార్టీలు బీఆర్ఎస్ ను నిలువరించి అధికారాన్ని చేపట్టడానికి ఏదో ఒక విధంగా ఫలితాలను తారుమారు చేస్తూ మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నాయని ఆరోపించారు.. రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఏమో దేశమంతా బీజేపీ మీద పోరాటం చేస్తే.. ఇక్కడ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఏమో బీజేపీతో జత కడుతున్నది.రాహుల్ గాంధీ .. మీరు ఢిల్లీలో రాజ్యాంగం పట్టుకొని తిరుగుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారు. దానికి ఈ పొత్తులే సాక్ష్యమని హరీష్ రావు స్పష్టం చేశారు.కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డిని, బండి సంజయ్‌ను సూటిగా ప్రశ్నిస్తున్నాను.. మున్సిపాలిటీలో చైర్మన్ ఎన్నికకు బీజేపీ పార్టీ కాంగ్రెస్‌తో కలిసింది మీకు తెలియదా..? తెలిసే చేశారా..? ఢిల్లీలో పెద్దలు కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటారు.. ఇక్కడ మీరేమో కాంగ్రెస్ యుక్త్ బీజేపీ అని నిరూపిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఉన్న బలాన్ని చూసి భయపడే మీరు ఈ కుట్రలకు తెరలేపారని హరీష్ రావు మండిపడ్డారు. సింగిల్‌గా మా పార్టీని ఎదుర్కొనే దమ్ములేక.. రెండు జాతీయ పార్టీలు ఒక్కటై, బీఆర్ఎస్ మీద దాడి చేస్తున్నాయి. ఇది మా విజయానికి నిదర్శనం కాక మరి ఏమిటి...? బీఆర్ఎస్ అత్యధిక వార్డులు గెలుచుకున్న చోట్ల కూడా కుట్రలు చేసి పదవులు దక్కించుకున్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో చైర్మన్ పదవి కాంగ్రెస్ తీసుకుని, వైస్ చైర్మన్ పదవి బీజేపీకి ఇచ్చారంటే ఇంతకంటే దిగజారుడు రాజకీయం మరొకటి ఉంటుందా..? ఒక పక్క నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎంఐఎంతో పొత్తు పెట్టుకుంటారు. మరోపక్క ఉత్తర తెలంగాణలో బీజేపీతో జతకడతారు. ఇదేనా ప్రజా పాలన. సిర్పూర్ కాగజ్‌నగర్‌లో, మెట్‌పల్లిలో కూడా ఇదే తంతు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను బీజేపీ కాంగ్రెస్ పంచుకోవడం రాష్ట్ర ప్రజలే కాదు దేశ ప్రజలు కూడా గమనిస్తున్నారు. నర్సాపూర్ లో కాంగ్రెస్ చైర్మన్ --బీజేపీ వైస్ చైర్మన్,సిర్పూర్ కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ (11 సీట్లు) ఉన్నా.. కాంగ్రెస్, బీజేపీలు కలిసి అధికార పీఠాన్ని హైజాక్ చేశాయన్నారు. అలియాబాద్‌లో బీజేపీకి ఉన్న 3 సీట్ల మద్దతుతో కాంగ్రెస్ చైర్మన్ సీటు దక్కించుకుంది. మెట్‌పల్లిలో విచిత్రం ఏంటంటే.. బీజేపీకి అధికారం దక్కేలా కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది.అమన్ గల్.. ఇక్కడ కూడా బీజేపీ, కాంగ్రెస్ మధ్య లోపాయికారి ఒప్పందం నడిచింది. కాంగ్రెస్, బీజేపీ ఫెవికాల్ బంధాన్ని చూడలేక కొన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఓటింగ్ కి దూరంగా ఉన్నామన్నారు హరీష్ రావు. మరోవైపు.. క్యాతనపల్లి, తొర్రూరు, జనగామ, జహీరాబాద్ లాంటి మున్సిపాలిటీల్లో



బీఆర్ఎస్‌కు ప్రజలు మెజారిటీ సీట్లు కట్టబెట్టినప్పటికీ.. అక్కడ ప్రజా తీర్పును గౌరవించకుండా అధికార యంత్రాంగాన్ని, పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని చైర్మన్ పీఠాలను హైజాక్ చేయాలని చూస్తున్నారు. కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేస్తూ, అధికారులను పావులుగా వాడుకుంటూ.. ఎలాగైనా సరే అందలం ఎక్కాలని కాంగ్రెస్, బీజేపీలు కుటిల రాజకీయాలకు తెరలేపాయన్నారు. బీఆర్ఎస్ పార్టీని దెబ్బకొట్టడానికి సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చారు. కాంగ్రెస్ ముసుగులో బీజేపీ, బీజేపీ ముసుగులో కాంగ్రెస్ పనిచేస్తున్నాయి. ఈ అపవిత్ర కలయికను తెలంగాణ సమాజం అసహ్యించుకుంటున్నది. రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ బీజేపీలకు బుద్ధి చెప్తారన్నారు.

## మహిళలకు శివరాత్రి కానుక

**- అర్హుల ఖాతాల్లో రూ.10 వేల జమ**

**- నితీశ్ కుమార్ నిర్ణయంపై హర్షం**



**పట్నా, ఫిబ్రవరి 16** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మహిళలకు శివరాత్రి కానుకగా రాష్ట్రంలోని అర్హత కలిగిన మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేల చొప్పున నేరుగా జమ చేయించారు. తమ ఖాతాల్లో డబ్బు జమ కావడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా ఇలాగే మహిళల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ చేసిన విషయం తెలిసిందే. ఆ నిర్ణయం ప్రభావంతో మహిళలు పెద్ద ఎత్తున ఓటు వేసి భారతీయ జనతా పార్టీ--జనతాదళ ఐక్య కూటమికి మద్దతు తెలిపినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఫలితంగా ఎన్డీయే కూటమి 202 స్థానాలు గెలుచుకుని నితీశ్ కుమార్ మరో సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.ఇప్పుడు శివరాత్రి సందర్భంగా మళ్లీ నేరుగా నగదు జమ చేయడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ అవసరాలకు ఈ నిధులు ఉపయోగపడతాయని పలువురు లబ్ధిదారులు పేర్కొన్నారు. మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మహిళల సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభమని ప్రభుత్వం పేర్కొంటోంది.

### ఉండవల్లిలో అరటి తోట

# సందర్శించిన బిల్ గేట్స్

**వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక వినియోగం ప్రదర్శన**

**రైతులకు కృత్రిమ మేధ ఆధారిత సలహాలు**



**అమరావతి, ఫిబ్రవరి 16** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ప్రపంచ ప్రఖ్యాత వ్యాపారవేత్త బిల్ గేట్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఉండవల్లిలోని అరటి తోటను సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం వినియోగిస్తున్న ఆధునిక సాంకేతికతను ముఖ్యమంత్రి వివరిం చారు. ఉండవల్లికి విచ్చేసిన బిల్ గేట్స్‌కు సంప్రదాయబద్ధంగా స్వాగ తం పలికారు. అరటి తోటలో డ్రోన్ల సహాయంతో మందులు పిచికారీ చేసే విధానాన్ని ప్రదర్శించారు. వ్యవసాయంలో సాంకేతిక వినియో గం రైతులకు ఎలా ఉపయోగప డుతుందో బిల్ గేట్స్ ఆసక్తిగా పరిశీలించారు. రైతులు సంప్రదా యాలను గౌరవిస్తూ సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారని ముఖ్య మంత్రి పేర్కొన్నారు. పంటలు, మార్కెట్ ధరలు, నేల స్వభావం ఆధారంగా కృత్రిమ మేధ ద్వారా రైతులకు ఖచ్చితమైన సలహాలు అందిస్తున్నామని సీఎం తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, సుస్థిర పద్ధతులను రాష్ట్రంలో చురుకుగా ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి అక్కడి రైతులను అభినందించారు. సాంకేతిక ఆధారిత వ్యవసాయ విధానాలు రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది.

# పదవులు శాశ్వతం కాదు

**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**తనకు పదవులు ఇవ్వకపోయినా పర్వాలేదని వ్యాఖ్య**

మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదవులు శాశ్వతం కాదని, తన నియోజకవర్గం అభివృద్ధి తనకు ముఖ్యమని ఆయన అన్నారు. తనకు పదవులు ఇవ్వకపోయినా పర్వాలేదని మునుగోడు నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తే చాలని అన్నా రు. కాగా, రాజగోపాల్ రెడ్డి ఇటీవలి వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకున్న విషయం తెలిసిందే. తనకు మంత్రి పదవి ఇవ్వాలని, ఆ హామీతోనే తాను పార్టీలోకి వచ్చానని ఆయన ఇటీవల వెల్లడించారు. తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని లేదంటే ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నిస్తానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మళ్లీ అడగబోనని, కానీ తనకూ ఒకరోజు



వస్తుందని, ఆ రోజు లాక్కుంటానని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి ఒక్కరే కష్టప డితే కాంగ్రెస్ అధికారంలోకి రాలేదని, పార్టీ లోని వారంతా శ్రమించారని అన్నారు.

### బీజేపీ ఓట్ల శాతం

## పెరిగింది

**రామచందర్‌రావు**



హైదరాబాద్: తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజల నుండి మంచి ఆదరణ లభించిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు తెలిపారు. ఈ ఎన్నికల్లో పార్టీ ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు. గతంతో పోలిస్తే ఎక్కువ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం పార్టీ బలోపేతానికి సంకేతమని పేర్కొన్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకు ఇతర పార్టీలు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని రామచందర్ రావు అన్నారు. భైంసాలో బీజేపీ విజయం సాధించకుండా చేయాలని చాలా ప్రయత్నాలు జరిగాయని చెప్పారు.

# చైర్మెన్,వైస్ చైర్మెన్ ఎన్నిక వాయిదా అప్రజాస్వామికం..

### తండ్రి కాక పేరుని చెడగొడుతున్న తనయుడు మంత్రి వివేక్..

### మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్




**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 16, (మన సమాజం):** క్యాతనపల్లి మున్సిపాలిటీలో జరగాల్సిన చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక వాయిదా పడటం అప్రజాస్వామికమని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. స్థానికంగా ఉన్న తన నివాసంలో సిపిఐ నాయకులతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రిగా ఉన్న వివేక్ కంత్రి వేషాలు మానుకోవాలని సూచించారు. కూటమి కౌన్సిలర్లు ఉన్న క్యాంపు పై పోలీసులతో రైడ్ చేయించడం, పట్టణ కాంగ్రెస్ నాయకులను ఉసిగొల్పడం వంటి చర్యలు తగ్గించుకోవాలన్నారు. చట్టాలను గౌరవించని కాంగ్రెస్ నాయకులు గుండాయిజం చేస్తూ ప్రజలు గెలిపించిన తమ కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకోవాలనే యోచనతో ఎన్నికను వాయిదా పడేలా మంత్రి పెద్ద ప్లాన్ చేశారని మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా రాష్ట్రంలో కాక వెంకటస్వామికి ఉన్న మంచి పేరును తనయుడు మంత్రి వివేక్ చెడగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం ఉందని పోలీస్ బలగాలతో కూటమి నాయకులను ప్రమాణ స్వీకరణకు రానివ్వకుండా అడ్డుకొని ఎన్నికనే వాయిదా వేసిన మంత్రి తీరుకు రానున్న రోజుల్లో ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య మాట్లాడుతూ పొత్తు ధర్మంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా కూటమి కౌన్సిలర్లు చైర్మెన్, వైస్ చైర్మెన్ అవుతారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాల్సిన పోలీసులే అధికార కాంగ్రెస్ నాయకులకు ఊడిగం చేయడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా నేడు జరిగే మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక సజావుగా జరిగేలా చూడాలని పోలీసులను, సంబంధిత అధికారులను కోరారు. కాగా సిపిఐ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపితే ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్యకి ఎమ్మెల్సీ పదవిని కాంగ్రెస్ అధిష్టానం ఆఫర్ చేసిందా అని మన సమాజం పత్రిక అడిగిన ప్రశ్నకు రాష్ట్రంలో ఎలా ఉన్న క్యాతనపల్లిలో మాత్రం ప్రజలు ఇచ్చిన తీర్పుకు పొత్తు ధర్మం పాటిస్తామని కూటమి కౌన్సిలర్లే చైర్మెన్, వైస్ చైర్మెన్ పదవిలో ఉంటారని సీతారామయ్య స్పష్టంగా చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, నాయకులు డా. రాజరమేష్, కంభగోని సుదర్శన్ గౌడ్, మేడిపల్లి సంపత్, గెలిచిన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక నేటికి వాయిదా

### బిఆర్ఎస్ సిపిఐ కూటమికి కలిసొచ్చిన ప్రజాదరణ, కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత...





**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 16, (మన సమాజం):** క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయం ముందు జరిగిన తీరుతో చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక వాయిదా పడాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో ఎన్నిక జరగాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ క్యాతనపల్లిలో విచిత్రమైన వైఖరి నెలకొంది. పోలీస్ యంత్రాంగం కార్యాలయానికి ఇరువైపుల ఉన్న రైల్వే బ్రిడ్జి రోడ్డు మార్గంపై కేవలం కౌన్సిలర్ అభ్యర్థులను కార్యాలయం లోపలికి రావాలని పటిష్టమైన బందోబస్తు నిర్వహించినప్పటికీ ముందుగానే కాంగ్రెస్ నాయకులు కార్యాలయం ప్రధాన గేటు దగ్గరకి చేరుకోవడం అనేది పోలీసులు అధికార పార్టీ నాయకులకు ఇచ్చిన ప్రత్యేకతపై అనుమానాలకు దారితీస్తుంది. బిఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కూటమి ద్వారా గెలుపొందిన కౌన్సిలర్లతో మున్సిపల్ కార్యాలయానికి వస్తుండగా రోడ్డుపై ఎందుకు అడ్డుకున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక వైపు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులైన రఘునాథ్ రెడ్డిని ఎందుకు లోపలకి అనుమతించారు అని సిపిఐ, బిఆర్ఎస్ కూటమి నాయకులు ప్రశ్నించారు. కేవలం ఏడుగురు కౌన్సిలర్లు ఉన్న కాంగ్రెస్ ఒక స్వతంత్ర కౌన్సిలర్ గుర్రం శ్రీనివాస్ కు పార్టీ కండువా కప్పి తమ బలాన్ని ఎనిమిదికి చేకూర్చుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో పొత్తులో ఉన్న సిపిఐ మాత్రం క్యాతనపల్లిలో బిఆర్ఎస్ పొత్తుతో నాలుగు స్థానాల్లో కౌన్సిలర్లు గెలుపొందారు. గెలిచిన కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసైనా తమ వైపు తిప్పుకోవాలనే యోచనతో ఎన్నిక వాయిదా పడేలా మంత్రి వివేక్ ప్లాన్ చేసినట్లు ఉందని, దానికి అనుకూలంగానే కాంగ్రెస్ నాయకులు కార్యాలయం ఎదుట హైడ్రామా సృష్టించి ఎన్నిక వాయిదా పడేలా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. విచిత్రమేమిటంటే మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కౌన్సిలర్లతో కార్యాలయానికి చేరుకుంటారనే సమాచారంతో మందమర్రి తహసీల్దారు సతీష్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారానికి ఉదయం 11 గంటలకు సమయం ఇవ్వగా 12 గంటల 15 నిముషాల వరకు ఎ ఒక్క కౌన్సిలర్ కార్యాలయానికి చేరుకోవడంతో ఎన్నికను నేటికి వాయిదా వేస్తున్నామని ప్రకటించడం అధికార పార్టీకి అనుకూలంగా మాట్లాడనట్లే ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ కార్యాలయంలోకి బిఆర్ఎస్, సిపిఐ నాయకులు వెళ్లడానికి ప్రయత్నం చేయకపోయినా లేని ఒక సమస్యను సృష్టించి ఎన్నిక వాయిదా పడేయాలని చూసిన అధికార యంత్రాంగం ప్రజాధనం వృధా చేస్తుందని ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. నిన్న మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగిన తీరుతో మాత్రం బిఆర్ఎస్ సిపిఐ కూటమికి ప్రజాధరణ పెరిగి కాంగ్రెస్ మాత్రం తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుందని మేధావివర్గం చర్చింకుంటుంది.

ఇదిలా ఉంటే నాయకులు మాటలు మరోలా ఉన్నాయి.

**బాల్క సుమన్ అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నం చేస్తున్నారు.**

**డిసిసి అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి..**



ఎక్కడో క్యాంప్ లో ఉన్న బిఆర్ఎస్, సిపిఐ కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీ, మంత్రి వివేక్ ప్రలోభాలకు గురిచేస్తున్నారని, ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని మంచిర్యాల డిసిసి అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి మండిపడ్డారు. గుండా రాజకీయాలు సుమన్ కు కొత్తవేమికావని, తమ ఉనికిని చాటుకోవడానికి కౌన్సిలర్లను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ నాయకులు కిడ్నాప్ లు చేస్తారని లేదా డబ్బు ఆశా తమ కౌన్సిలర్లకి చూపుతున్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక సమయంలో బాల్క సుమన్ అలజడి వాతావరణం సృష్టిస్తారనే కారణంతోనే క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయం లోపలికి అనుమతి ఇవ్వద్దని సంబంధిత అధికారులను కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

**అధికారంతోనే ఎన్నిక వాయిదా..**

అధికారం అడ్డం పెట్టుకొని ఎన్నికలు వాయిదా పడేలా చేసిన కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్. ఎన్నికకు ఖచ్చితమైన సమయం ఇవ్వని అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా ఎన్నికను ఎలా వాయిదా వేస్తారని చురకలు వేశారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని కుట్రలు చేసిన కూటమి కౌన్సిలర్లు తలొగ్గే పరిస్థితి లేదని, అధికారాన్ని అడ్డంపెట్టుకొని పోలీస్ బలగాలతో ఎన్ని ప్రయత్నాలు చేసిన చైర్మెన్, వైస్ చైర్మెన్ పదవులు కూటమిదేనని స్పష్టంచేశారు.

## వనపర్తి మున్సిపాలిటీలో కలకలం

**కాంగ్రెస్‌కు కౌన్సిలర్ రాజీనామా**

**చైర్మన్ పదవి విషయంలో మోసం చేశారన్న ఆరోపణ**



**వనపర్తి, ఫిబ్రవరి 16** వనపర్తి మున్సిపాలిటీలో రాజకీయ కలకలం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి కౌన్సిలర్ చీర్ల రజిని చందర్ రాజీనామా చేశారు. చైర్మన్ పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆమె ఆరోపించారు. టికెట్ ఇచ్చిన సమయంలోనే చైర్మన్ అవకాశం ఇస్తేనే పోటీ చేస్తామని స్పష్టం చేశామని, కానీ ఎన్నికల తర్వాత ఆ హామీ నిలబెట్టుకోలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి తనను అమ్ముకున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మూడు తరాలుగా తమ కుటుంబం కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి పనిచేసిందని, తమ నమ్మకాన్ని పార్టీ వమ్ము చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే పార్టీ సభ్యత్వంతో పాటు పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిచిన రజిని చందర్ రాజీనామా చేయడంతో స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ నాయకత్వం ఈ పరిణామంపై ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

## నల్గొండ కార్పొరేషన్ నాకల సాకారం: కోమటిరెడ్డి

**ప్రజాప్రతినిధుల ప్రమాణ స్వీకారంతో గర్వం**

**క్లీన్-గ్రీన్-స్మార్ట్ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యం**

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**




**నల్గొండ, ఫిబ్రవరి 16** నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు తన కల అని, ఆ కల సాకారమై అభ్యర్థులు ప్రజాప్రతినిధులుగా ప్రమాణ స్వీకారం చేయడం గర్వకారణమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. నల్గొండ తన జన్మభూమి అని, ఇక్కడి ప్రతి వీధి తనకు భావోద్వేగ అనుబంధమని తెలిపారు. నల్గొండను దేశం గర్వించేలా పరిశుభ్ర-హరిత-స్మార్ట్ నగరంగా తీర్చిదిద్దడమే తన జీవిత ఆశయమని చెప్పారు. రాజకీయాలకు తావులేకుండా, ఓడిపోయిన డివిజన్లలో కూడా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రతి పేదవాడి ఇంటికి సంక్షేమం, ప్రతి వీధికి ఆధునిక వసతులు చేరేలా కృషి చేస్తానని తెలిపారు. మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్‌తో పాటు నూతన కార్పొరేటర్లకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రజల ఆశయాలను నెరవేర్చేలా సమిష్టిగా పనిచేయాలని కోరారు. ఫ్లోరోసిస్ వ్యతిరేక పోరాటం నుంచి నేటి నగరాభివృద్ధి వరకు తన ప్రయాణం కొనసాగుతుందని కోమటిరెడ్డి అన్నారు. నవ నల్గొండ నిర్మాణానికి అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## హైదరాబాద్‌లో నగల దుకాణంలో భారీ దోపిడీ


**రూ.1 కోటి విలువైన ఆభరణాల అపహరణ**





**హైదరాబాద్, ఫిబ్రవరి 16** హైదరాబాద్‌లోని పంజాగుట్ట ప్రాంతంలో ఉన్న ప్రముఖ నగల దుకాణంలో భారీ దోపిడీ వెలుగులోకి వచ్చింది. దుకాణంలో పని చేసే ఉద్యోగి సుమారు రూ. 1 కోటి విలువ చేసే ఆభరణాలను దొంగిలించినట్టు పోలీసులు వెల్లడించారు. పంజాగుట్టలోని జోయ్ అలుక్కాస్ నగల దుకాణంలో పనిచేస్తున్న అజిత్ అనే ఉద్యోగి ఈ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. ఎవరికీ అను మానం రాకుండా రోజూ కొద్దికొద్దిగా ఆభరణాలను దొంగిలించినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. విలువైన నగలు కనిపించకపోవడంతో యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. దొంగిలించిన ఆభరణాల వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనలో నిందితుడికి మరెవరైనా సహకరించారా? లేక అతడే స్వయంగా ఈ చర్యకు పాల్పడ్డాడా? అనే అంశంపై పోలీసులు లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.

# కొల్లాపూర్‌లో నూతన పురపాలకవర్గ ప్రమాణ స్వీకారం

**- సభ్యులకు జూపల్లి కృష్ణారావు శుభాకాంక్షలు - ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని పిలుపు**





**కొల్లాపూర్, ఫిబ్రవరి 16**
కొల్లాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిం చిన నూతన పురపాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణా రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్య తలు స్వీకరించిన పురపాలకవర్గ సభ్యులకు శు భాకాంక్షలు తెలిపారు. నూతన ఒరవడితో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందిస్తూ కొల్లాపూర్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని సూచించారు. అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శక పాలన అందించాలని పిలుపు నిచ్చారు. 19 వార్డులలో 16 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిం చిన పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఏకపక్ష తీర్పు అభివృద్ధి పట్ల ఉన్న ఆశయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా నూతన పురపాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని జూపల్లి కోరారు.

# హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్‌కు శుభాకాంక్షలు: పొన్నం ప్రభాకర్

**- నూతన వైస్ చైర్మన్‌కు అభినందనలు - పట్టణాభివృద్ధికి కట్టుబాటు**





**హుస్నాబాద్, ఫిబ్రవరి 16 :**
హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన దండి లక్ష్మి కొముురయ్యకు, వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన చిత్తారి పద్మ రవీందర్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల విశ్వాసంతో బాధ్యతలు స్వీకరించిన నూతన నాయకులు పట్టణ అభివృద్ధి దిశగా సమర్థంగా పనిచేయాలని ఆకాంక్షించారు. పారదర్శకత, ప్రజాహిత భావనతో పాలన కొనసాగించాలని సూచించారు. హుస్నాబాద్ పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మౌలిక వసతుల బలోపేతం, ప్రజా సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన పాలకవర్గం ముందుకు సాగాలని పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# కరీంనగర్‌లో బీజేపీ చరిత్రాత్మక విజయం

**- మొట్టమొదటి బీజేపీ మేయర్ ప్రమాణ స్వీకారం - కార్యకర్తల కృషికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కృతజ్ఞతలు**

**కరీంనగర్, ఫిబ్రవరి 16**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో తొలిసారిగా భారతీయ జనతా పార్టీ మేయర్ ప్రమాణ స్వీకారం చేయడం చరిత్రాత్మక ఘట్టమని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

కరీంనగర్ మేయర్‌గా కొలగాని శ్రీనివాస్, ఉప మేయర్‌గా వై. సునీల్ రావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ఇది కేవలం రాజకీయ విజయం మాత్రమే కాకుండా భావోద్వేగ క్షణమని బండి సంజయ్ అన్నారు. కార్పొరేటర్‌గా వార్డుల వారీగా పాదయాత్రలు చేసిన రోజుల నుంచి ఈ రోజు వరకు సాగిన ప్రయాణం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టిపై విశ్వాసం ఉంచిన ఓటర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయానికి ప్రతి కార్యకర్త కృషి కారణమని ఆయన స్పష్టం చేశారు. ఒత్తిళ్లు, బెదిరింపులు, అవమానాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పోరాడిన కార్యకర్తలే ఈ విజయానికి పునాది వేశారని పేర్కొన్నారు. కుట్రలు, ఒత్తిడి రాజకీయాల మధ్య కూడా బీజేపీ దృఢంగా నిలిచి విజయాన్ని సాధించిందన్నారు.



కరీంనగర్ ప్రజలు మేయర్‌ను మాత్రమే ఎన్నుకోలేదు, చరిత్రను సృష్టించారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీ బలోపేతానికి కేంద్ర నాయకత్వం అందించిన మద్దతుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు.

# రాష్ట్రపతిని కలిసిన అధికార శిక్షణార్థులు

**- రాష్ట్రపతి భవన్‌లో భేటీ - దేశాభివృద్ధికి నిబద్ధతతో పనిచేయాలని సూచన**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16**
భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును భారత లెక్కల మరియు ఖాతాల సేవ, రక్షణ వైమానిక నాణ్యత భరోసా సేవ, భారత వాణిజ్య సేవలకు చెందిన అధికార శిక్షణార్థులు రాష్ట్రపతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, దేశాభివృద్ధి మరియు ప్రతి పౌరుని సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేసే అధికారులే దేశాన్ని మరింత బలంగా, సామర్థ్యవంతంగా, ప్రపంచ వేదికపై గౌరవప్రదంగా నిలబెడతారని పేర్కొన్నారు. సేవాభావం, కర్తవ్యనిర్వహణలో అంకితభావం ఎంతో ముఖ్యమని తెలిపారు. భారత పరిపాలన వ్యవస్థలో యువ అధికారుల పాత్ర



కీలకమని, వారు తీసుకువచ్చే ఉత్సాహం రేపటి భారతాన్ని రూపుదిద్దగల శక్తిగా నిలుస్తుందని రాష్ట్రపతి అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. దేశ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని శిక్షణార్థులను ప్రోత్సహిస్తూ, సమర్థత, పారదర్శకత, ప్రజాసేవల పట్ల కట్టుబాటు కలిగి ఉండాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆహ్వానించారు.

# మహారాష్ట్రలో వింత ఘటన

**కుక్కలా వాహనాలపైకి దూకిన యువకుడు**

**మానసిక సమస్యగా వైద్యుల నిర్ధారణ**



**సాతారా, ఫిబ్రవరి 16:**
మహారాష్ట్రలోని సాతారా–రహిమత్‌పూర్ రోడ్డులో అంగాపూర్ ఫాటా వద్ద వింత ఘటన కలకలం రేపింది. ఓ యువకుడు కుక్కలా ప్రవర్తిస్తూ రోడ్డుపై వెళ్లే వాహనాలపైకి దూకడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో ఆ ప్రాంతంలో ఆందోళన నెలకొంది. తొలుత యువకుడికి రేబీస్ సోకిందేమోనని అనుమానం వ్యక్తమైంది. అయితే వైద్యులు పరిశీలించిన అనంతరం అతడు తీవ్రమైన మానసిక రుగ్మతతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. ప్రస్తుతం అతడికి అవసరమైన వైద్యం అందిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

# విదేశీ స్కాలర్‌షిప్‌లతో సర్కార్ చెలగాటం



ఆలస్యం అమృతం విషం అన్న సూక్తి బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు నిధులు విడుదల చేయడంలో మాత్రం యథార్థం. ముఖ్యంగా రాజవతీంమ్ఖుం వసబమ్ఘ్అశీఅ ఒమ్ష్టవవవ కింద దరఖాస్తు చేసుకొని నాటి కేసీఆర్ ప్రభుత్వం నుంచి మంజూరు పత్రాలు పొంది, రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రభుత్వంలో స్కాలర్‌షిప్‌ల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థుల విషయంలో ఇది రూఢీ అయింది. అమెరికా తదితర దేశాల్లో ఉన్నత చదువులకు వెళ్లిన విద్యార్థులకు ముఖ్యంగా ట్రంప్ విధానాలు, ఇక్కడ మన ప్రభుత్వం ఉదాసీనతతో అడకత్తెరలో పోకచెక్కల్లా నలిగిపోతున్నారు. గత మూడేండ్లుగా అమెరికాలో ఎంఎస్ పూర్తి చేసి రెసిషన్ వల్ల ఉద్యోగాలు పొందలేక, మళ్లీ ఇతర కోర్సుల్లో జాయిన్ అవుతూ అప్పులు తీర్చడానికి మళ్లీ అప్పులు చేస్తున్నారు విదేశీ విద్యాపథకం కింద వెళ్లిన విద్యార్థులు. అక్కడ తిప్పలు పడుతూ నిరాశ నిస్పృహల్లో భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగాలు లేనందున, నెలవారీ ఖర్చుల కింద ఇక్కడి వారి తల్లిదండ్రులు బ్యాంకుల్లో బంగారం కుదువబెట్టి, బంధుమిత్రుల వద్ద చేయగలిగినంత అప్పు చేస్తూ నరకయాతన అనుభవిస్తున్నారు. కొండవీటి చాంతాడులా అప్పు పెరిగిపోతుంటే, గత నెల పాలకులు కనికరించి, విద్యార్థులకు మంజూరైన రూ.20 లక్షల్లో పాతిక భాగం అంటే ఐదు నుంచి ఏడు లక్షల వరకు వారి ఖాతాల్లో జమ చేశారు. కానీ ఇవే డబ్బులు రెండేండ్ల కిందటే వేస్తే అప్పు తాలూకు వడ్డీ భారం ఎంతో తగ్గి ఉండేది. రాష్ట్ర సర్కార్ నిధులు జమచేసినా ప్రయోజనం లేకపోయింది. కారణం.. అభ్యర్థులు అమెరికాలో ఉన్నత చదువులకు కేవలం యూనివర్సిటీ ఫీజుకే 40 నుంచి 60 లక్షల వరకు ఆయా బ్యాంకుల నుంచి రుణం తీసుకొన్నారు. రెండేండ్ల ఎంఎస్ కోర్సు అయ్యాక వర్క్ పర్మిట్ పొందినప్పటికీ ఉద్యోగాలు లేక అజ్ఞాతవాసం చేస్తున్నారు. ఇటీవల అమెరికా ప్రభుత్వం హెచ్–1 బీ వీసాలను ఏకంగా 2027 మార్చి వరకు ఇవ్వరాదని నిషేధించింది. దాంతో విద్యార్థుల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టయింది. ఆ దేశ నిబం ధనల ప్రకారం విదేశీ విద్యా ర్థులు స్టూడెంట్ వీసా మీద ఉండరాదు. ఆర్థికమాంద్యం వల్ల కంపెనీలు ఉద్యోగ ప్రకట నలే చేయడం లేదు. అమెజాన్ వంటి కంపెనీలే భారీ ఎత్తున ఉద్యోగులను తొలగిస్తుండటంతో సర్వత్రా అభద్రతాభావం నెలకొన్నది. విద్యార్థులు ఉద్యో గాలు రాకపోవడంతో మరో కోర్సులో చేరుతున్నారు. దాంతో అప్పు మరింత అధికమవుతుం డడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నది. కేసీఆర్ సర్కార్ 2023లో విదేశీ విద్యా పథకం కింద అర్హులైన పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఆ తర్వాత వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొదటి విడతగా అక్టోబర్ 2025లో ఒక్కొక్క విద్యార్థికి దాదాపు రూ.7 లక్షల చొప్పున అందించడంతో అవి వేడి పెనం మీద నీళ్లు చల్లినట్లయి, బ్యాంకు వడ్డీ చెల్లింపులకే సరిపోయింది. అసలు రుణం సర్పంలా బుసలు కొడుతున్నది. ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో మిగతా రూ.13 లక్షలను కూడా రెండవ విడతగా అందించి ఆదుకోవాలని విద్యార్థులు అభ్యర్థిస్తున్నారు. ఈ డబ్బులు సకాలంలో ఇస్తే కనీసం బ్యాంకు రుణాలను తీర్చుకోవాలని విద్యార్థులు భావిస్తున్నారు. అమెరికాలో ఉద్యోగాలు రాక స్వదేశానికి రావలసి వస్తే, వారికి తొలుత అప్పులే స్వాగతం చెప్తాయి. రుణాల తాలూకు నెలసరి వాయిదాలు యమపాశాలవుతున్నాయి. నిధుల విడుదలలో ఆలస్యం అయితే విద్యార్థుల భవితవ్యమే ప్రశ్నార్థకమవుతుంది. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన అనంతరం రైతు భరోసా నిధులు విడుదల చేస్తానని సీఎం వాగ్దానం చేశారు. కానీ విదేశీ విద్యా పథకం కింద నిరుడు ఇవ్వాల్సిన నిధుల గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం విచారకరం. 2025 ఏప్రిల్‌లో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ.100 కోట్లు మంజూరు చేసినప్పటికీ అక్టోబర్ 2025 వరకు కేవలం రూ.25 కోట్లు మాత్రమే అందించారు. మిగిలిన రూ.75 కోట్లను సత్వరమే విడుదల చేసి, ఆదుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.




# నేను ఇండియాలోనే ఉండాలనుకుంటున్నా

### తాప్సీ సెటైరికల్ కామెంట్స్ వైరల్

సౌత్ నుంచి బాలీవుడ్ వరకు వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి తాప్సీ పన్ను మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 2010లో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన ఝుమ్మంది నాదం సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన ఆమె, 'మిస్టర్ పర్ఫెక్ట్', 'వీర', 'మొగుడు', 'దరువు', 'షాడో', 'గుండెల్లో గోదారి' వంటి చిత్రాల్లో నటించారు. అయితే తెలుగులో ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోవడంతో బాలీవుడ్‌పై దృష్టి సారించారు. హిందీ చిత్రసీమలో మాత్రం తాప్సీ తన కెరీర్‌ను పూర్తిగా మలుచుకున్నారు. గ్లామర్ పాత్రలకు భిన్నంగా కథా ప్రాధాన్యత గల పాత్రలను ఎంచుకుంటూ నటనతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ముఖ్యంగా పింక్, నామ్ శభాన, థప్పడ్, ముల్క్ వంటి సినిమాలతో ఆమె నటిగా తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. లేడీ ఓరియెంటెడ్ కథలను ఎంచుకోవడం ఆమె ప్రత్యేకతగా మారింది. ఇటీవల ఓ ప్రముఖ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తాప్సీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాపిడ్ ఫైర్ రౌండ్‌లో "మీకు ఇష్టమైన రాజకీయ నాయకుడు ఎవరు? నరేంద్ర మోదీనా? లేక రాహుల్ గాంధీనా?" అనే ప్రశ్న ఎదురవ్వగా తాప్సీ నవ్వుతూ మోదీ ఫోటో వైపు చేతులు జోడించి నమస్కారం చేశారు. వెంటనే "నాకు ఇంకా ఈ దేశంలోనే ఉండాలని ఉంది" అంటూ చమత్కారంగా సమాధానం ఇచ్చారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. కొందరు ఆమె చమత్కారాన్ని మెచ్చుకుంటూ స్మార్ట్‌గా హ్యాండిల్ చేసిందని అభిప్రాయపడుతుండగా, మరికొందరు ఈ వ్యాఖ్యలను రాజకీయ కోణంలో విశ్లేషిస్తూ ట్రోలింగ్‌కు దిగుతున్నారు. అభిమానులు మాత్రం తాప్సీ ఎప్పటిలాగే బోల్డ్‌గా మాట్లాడిందని ఆమెకు మద్దతు ఇస్తున్నారు. ఇక గతంలో కూడా తాప్సీ టాలీవుడ్‌పై చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. తెలుగులో హీరోయిన్‌లకు సరైన ప్రాధాన్యం ఉండదని, మహిళా పాత్రలకు కథలో బలం తక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. తాజాగా "నేను ఇండియాలోనే ఉండాలనుకుంటున్నా" అన్న ఒక్క మాటతో మళ్లీ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చారు. ఆమె కామెంట్స్‌పై ఇంకా చర్చ కొనసాగుతూనే ఉంది.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రమోషన్స్ జోరు...

### రెండో పాట రిలీజ్ డేట్ అనౌన్స్ చేసిన చిత్రబృందం




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ మాస్ ఎంటర్‌టైనర్ ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో రాశి ఖన్నా, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తుండగా, మాస్ కమర్షియల్ చిత్రాలకు కేరాఫ్ గా ఉన్న ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. సంగీత బాధ్యతలను రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ చేపట్టారు. మార్చి 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. ఇటీవల విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' లిరికల్ వీడియో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ పాటకు భారీ స్పందన లభించగా, అనేక మంది అభిమానులు వాట్సాప్ స్టేటస్‌లుగా కూడా పెట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు దేవిశ్రీప్రసాద్ అందించిన ఎనర్జిటిక్ బీట్‌లు జత కావడంతో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. మొదటి పాట సూపర్ హిట్ కావడంతో సినిమా మీద హైప్ మరింత పెరిగింది. ఇప్పటికే మొదటి సాంగ్ సక్సెస్ కావడంతో రెండో పాట కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో చిత్రబృందం 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో సాంగ్‌ను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన పోస్టర్ ప్రత్యేక డిజైన్‌తో ఉండి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ లుక్, మాస్ అటిట్యూడ్ పోస్టర్‌లో హైలైట్ కావడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత రెట్టింపైంది. గతంలో పవన్ కళ్యాణ్ -- హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన గబ్బర్ సింగ్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి పవన్ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించింది. అదే కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా మాస్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా కనిపిస్తోంది.

# థియేటర్లలో ఫట్, ఓటీటీలో హిట్ ..

### బాలయ్య 'అఖండ 2' నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్



నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన తాజా చిత్రం అఖండ 2 థియేటర్లలో ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా, ఓటీటీ వేదికపై మాత్రం సరికొత్త విజయగాథను రాస్తోంది. మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఆదిపినిశెట్టి, సంయుక్త, పూర్ణ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటించగా, 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ సినిమాను నిర్మించారు. శివతత్వం ప్రధానంగా తెరకెక్కిన ఈ చిత్రం గత ఏడాది డిసెంబర్ 12న విడుదలైంది. అసలు డిసెంబర్ 5న రావాల్సిన ఈ సినిమా ఆర్థిక కారణాల వల్ల వారం రోజుల వాయిదాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే విడుదల ఆలస్యం, కథనంలో ఎక్కువగా ఆధ్యాత్మిక బోధనలు ఉండటం, 'అఖండ' స్థాయి ఎమోషన్ మిస్ కావడం వంటి కారణాలతో ఈ చిత్రం థియేటర్లలో పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. విమర్శకుల నుండి కూడా మిశ్రమ స్పందన రావడంతో బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. అయితే ఇదే సినిమా ఓటీటీలో మాత్రం ఊహించని రీతిలో పుంజుకుంది. ప్రముఖ స్ట్రీమింగ్ వేదిక చీవ్‌టశ్రీఱఇ లో జనవరి 9 నుంచి స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రం ప్రారంభంలో పెద్దగా గుర్తింపు పొందకపోయినా, క్రమంగా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటూ ట్రెండ్‌లోకి వచ్చింది. ముఖ్యంగా మహాశివరాత్రి సందర్భంగా శివభక్తి నేపథ్యం ఉండటంతో ప్రేక్షకులు ఈ సినిమాను ఎక్కువగా వీక్షిస్తున్నట్లు ట్రెండ్స్ సూచిస్తున్నాయి. ఇండియా వైడ్‌గా నెట్‌ఫ్లిక్స్ టాప్ 10 మూవీస్ జాబితాలో ఈ చిత్రం తొమ్మిదో స్థానంలో నిలవడం విశేషం. ఓటీటీలోకి వచ్చి నెల రోజులు దాటిన తర్వాత కూడా ట్రెండింగ్‌లో ఉండటం సినిమా పట్ల ప్రేక్షకుల ఆసక్తిని తెలియజేస్తోంది. థియేటర్లలో నిరాశపరిచిన సినిమా ఓటీటీలో విజయాన్ని అందుకోవడం అరుదైన విషయమేనని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ ఇండియా టాప్ 10 జాబితాలో ఇతర చిత్రాలు, షోలు కూడా పోటీగా ఉన్నప్పటికీ 'అఖండ 2' తన ప్రత్యేక శివతత్వ కంటెంట్‌తో నిలదొక్కుకుంటోంది. ఆలస్యంగా అయినా ప్రేక్షకులకు కనెక్ట్ అవుతూ డిజిటల్ వేదికపై బాలయ్య సినిమా మరోసారి తన మార్క్ చూపిస్తోందని చెప్పవచ్చు.

# మెగా మూవీలో చాన్స్?

మలయాళంలో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న అనస్వర రాజన్.. 'చాంపియన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువైంది. ప్రస్తుతం భాషలకు అతీతంగా సినిమాలు చేస్తూ ఈ మలయాళభామ చాలా బిజీగా ఉంది. ఈ క్రమంలో ఈ టాలెంటెడ్ యాక్ట్రస్‌కి టాలీవుడ్‌లో మరో అద్భుతమైన అవకాశం వరించినట్టు ఇన్‌సైడ్ టాక్. చిరంజీవి కథానాయకుడిగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. తండ్రీకూతుళ్ల అనుబంధమే ప్రధాన ఇతివృత్తంగా సాగే పవర్‌ఫుల్ కథతో తెరకెక్కనున్న ఈచిత్రంలో చిరంజీవి కూతురు పాత్రకు చాలామంది యంగ్ క్రేజీ కథానాయికలను అనుకున్నారు. అయితే.. ఆ అవకాశం చివరకు అనస్వర రాజన్‌ని వరించిందని తెలిసింది. కూతురు పాత్రకు ఈ కథలో అత్యంత ప్రాధాన్యత ఉండటంతో ఈ బరువైన పాత్రకు అనస్వరరాజన్ అయితేనే న్యాయం చేకూర్చగలదని దర్శకుడు బాబీ భావించారట. త్వరలోనే టీమ్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

